క్లుప్తంగా

ఎంపీ చొరవతో తాగునీటి బోరు



శీలయ్యగారిపల్లెలో బోరు డ్రిల్లింగ్

సదుం: మండలంలోని శీలయ్యగారిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చొరవతో బుధవారం రాత్రి కొత్తగా బోరు వేశారు. పుష్కలంగా నీరు పడిందని సింగిల్‌విండో మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, సర్పంచ్ ఐశ్వర్య తెలిపారు. సమస్య తెలిపిన వెంటనే పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, హైస్కూలు సిబ్బంది

సదుం: వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీశా అన్నారు. డెంగీ మాసోత్సవం సందర్భంగా మండలంలోని చెరుకువారిపల్లె జెడ్పీ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా జ్వర లక్షణాలతో బాధ పడుతున్నట్లైతే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ విద్యాసాగర్, హెచ్‌ఎం సందీప్ రెడ్డి, నీలకంఠ, జానకి, శిఖామణి పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు ఎంపిక



ప్రభుత్వాసుపత్రిలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎంఎస్ కంటి ఆసుపత్రి (చెన్నై) సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లకు 12 మందిని ఎంపికచేసినట్లు డాక్టర్ పవన్‌కుమార్ గురువారం తెలిపారు. శిబిరంలో 32 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. శశస్త్ర చికిత్స చెన్నై ఆసుపత్రిలో ఉచితంగా చేయించి స్వగ్రామాలకు వారిని చేరుస్తామన్నారు. కార్యక్రమంలో రహంతుల్లా ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఓగా హేమలత



పెద్దపంజాణి: మండల వ్యవసాయాధికారిగా ఎస్ఆర్. హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో ఈమె గంగవరం నుంచి ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ, మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

బదిలీల్లో నిబంధనలు సడలించాలి



మురళీనాథ్

పలమనేరు: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల్లో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలను సడలించాలని ఏపీ సచివాలయాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీఎస్ మురళీనాథ్ విజ్ఞప్తి చేశారు. గురువారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ మండలాన్ని ప్రామాణికంగా తీసుకొని వారి సొంత మండలం కాకుండా ఇతర మండలాలకు బదిలీ చేస్తున్నారన్నారు. ఇందులో మున్సిపాలిటీని సైతం మండలంలోనే కలపడంతో అర్బన్, రూరల్ లేకుండా పోయిందని, ఇదే ప్రధాన సమస్య అని చెప్పారు. ఇలా కాకుండా గ్రామం లేదా సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకోవాలని కోరారు.

ఐటీఐ రెండో విడత అడ్మిషన్లు

కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ఉన్న వివిధ ట్రేడ్‌లకు రెండో దశ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్ గురువారం తెలిపారు. స్థానిక ఐటీఐలో ఉన్న వివిధ ట్రేడ్లలో ఉన్న ఖాళీలకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జూలై 15 లోపు తమ పదో తరగతి మార్కుల లిస్టుతోపాటు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మహిళలకు కంప్యూటర్, టైలరింగ్ ట్రేడ్లలో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చే నెల 21వ తేదీ కార్వేటినగరం ఐటీఐ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

సుఖీభవ కాదు.. 7వేల మందికి దుఃఖీభవ..!

- వైఎస్సార్‌సీపీ హయాంలో 45,396 మంది లబ్ధిదారులు
- ప్రస్తుత కూటమి పాలనలో 38,375 మంది మాత్రమే!
- వీరిలో ఇప్పటికీ ఈకేవైసీ కానివారు 952 మంది
- మిగిలిన 7,021మంది అన్నదాతలు ఏమైనట్టో..?

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఈ పర్యాయం ఏడువేలమంది రైతులకు అన్నదాత సుఖీభవ పడనట్లేనని వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా ఇచ్చినట్లే ఇప్పుడు కూడా అందుతుందనే ధీమాగా ఉన్న రైతులకు కూటమి ప్రభుత్వం ఝలక్ ఇవ్వనుంది. సంక్షేమ పథకాల్లో కొర్రీలు పెట్టి కోతలు పెడుతున్న కూటమి ప్రభుత్వం రైతుల విషయంలోనూ వదిలిపెట్టలేదని దీన్ని బట్టి చూస్తే స్పష్టమవుతోంది.

గత ప్రభుత్వంలో లబ్ధిదారులు ఎంతమందంటే..!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 45,396 మంది రైతులకు వైఎస్సార్ రైతు నేస్తం వర్తించింది. ఏటా మూడు విడతలుగా (ఖరీఫ్‌లో పంటసాయంగా రూ.7,500, అక్టోబర్‌లో రూ.4వేలు, జనవరిలో రూ.2వేలు) మొత్తం రూ.13,500 జమయ్యేది. దీంతోపాటు పీఎం కిసాన్ ద్వారా రూ.6వేలు పడేది. ఈ నియోజకవర్గంలో గతంలో రైతుభరోసా ద్వారా రూ.225కోట్ల లబ్ధి పొందారు.

కూటమి పాలనలో 38,375మంది మాత్రమే....

ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో 38,775మందికి మాత్రమే అన్నదాత సుఖీభవ పడనుంది. వీరిలో ఇంకనూ 952మందికి ఈకేవైసీ కాలేదని అధికారులు చెబుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది పోగా ఈ పర్యాయం తొలివిడతగా రూ.5వేలు మాత్రమే ఇవ్వనున్నారు. పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2వేలు రానుంది. ఈ లెక్కన రెండూ కలిపి రూ.7వేలు. ఏడాదిలో కేంద్రం నుంచి మూడు దఫాలుగా రూ.6వేలు, రాష్ట్రం నుంచి తొలిసారిగా రూ.5వేలు, రెండోసారి రూ.5వేలు, మూడోసారి రూ.4వేలు మొత్తం రూ.20వేలు ఏటా అందాల్సి ఉంది.



గత ప్రభుత్వంలో 'వైఎస్సార్ రైతు భరోసా' లోగో

మిగిలిన 7వేల మంది రైతుల పరిస్థితేమిటో..?

గత ప్రభుత్వంలో లబ్ధిదారులుగా ఉండి కూటమి ప్రభుత్వంలో కోతకు గురైన 7,021మంది రైతుల పరిస్థితి ఏమిటనేది రైతన్నల నోట నానుతోంది. ఇప్పటికీ ఈ రైతులకు తాము అనర్హులమయ్యామనే విషయం వారికి తెలియదు. రేపో మాపో రైతుసేవా కేంద్రాల వద్ద జాబితాను చూస్తే అప్పుడు విషయం బయటపడుతుంది. వీరిలో అర్హులైన రైతులకు మళ్లీ ఇస్తారా, లేదా? అనేది వేచి చూడాలి.



కూటమి పాలనలో 'అన్నదాత సుఖీభవ' లోగో

నియోజకవర్గంలో ఏబీఎస్‌బీ లబ్ధిదారుల వివరాలిలా...

మండలం	లబ్ధిదారుల సంఖ్య
పలమనేరు	5264
బైరెడ్డిపల్లె	8043
వీ.కోట	9899
గంగవరం	7542
పెద్దపంజాణి	7627
మొత్తం	38,375

అధికారికంగా అందిన లబ్ధిదారుల జాబితా మేరకే!



ఉన్నతాధికారులనుంచి మాకొచ్చిన జాబితా మేరకు పలమనేరు నియోజకవర్గంలో లబ్ధిదారులు 38,375 మందిమాత్రమే. వీరిలో ఇంకా 952మంది ఈకేవైసీ కాలేదు. వీరికి ఆటో అప్‌డేట్ ద్వారా ఈకేవైసీ చేస్తున్నాం. వీరు ఇక ప్రత్యేకంగా ఈకేవైసీ చేయాల్సిన పనిలేదు. జాబితాలో పేరున్న రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం ఈ నెల 21న నగదు జమ చేసే అవకాశం ఉంది.

–గీతాకుమారి, అగ్రికల్చర్ ఇన్‌చార్జి ఏడీ, పలమనేరు

న్యాయం కోసం ధర్నా!



పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న అర్బన్ ఎస్ఐ

కుప్పం: స్థల వివాదానికి సంబంధించి పోలీసులు ఓ వర్గానికే కొమ్ముకాస్తున్నారని ఆరోపిస్తూ మరో వర్గానికి చెందిన మహిళలు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని జరుగు గ్రామానికి చెందిన మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ జరుగు గ్రామంలో నివాస గృహాల మధ్య మూడు సెంట్ల స్థలం కోసం అదే గ్రామానికి చెందిన శీనప్ప భార్య శాంతమ్మ, రామప్ప భార్య శాంతమ్మ గొడవ పడ్డారని తెలిపారు. దీంతో ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించినట్టు పేర్కొన్నారు. అయితే పోలీసులు ఒక వర్గం వైపే ఉన్నారని ఆరోపించారు. అర్బన్ ఎస్ఐ కలుగ జేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో మహిళలు శాంతించారు .

నగరవనం..ఇసుకాసురమయం..!



కౌండిన్య నదిలో రాత్రిపూట జేసీబీతో ఇసుకను తీసి ఉద్దలుగా పోసిన దృశ్యం



కౌండిన్య నదికి ఆనుకుని ఉన్న నగరవనంలో ఇసుకాసురుల దెబ్బకు వేళ్లు తేలి కూలే స్థితికి చేరిన వృక్షాలు

- అటవీ భూమిలోనూ ఇసుక తవ్వకాలు
- కౌండిన్య నదిలో నీటిలోనూ ఇసుకను తోడేస్తున్నారు
- జీడిమాకులపల్లెలో రేయింబవళ్లూ తోడివేత
- పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు

పలమనేరు: కౌండిన్య నదిలో ఇటీవల వర్షాలకు నీరు చేరడంతో ఇసుకాసురుల కన్ను నది పక్కనున్న అటవీశాఖ నగరవనంపై పడింది. నదికి ఆనుకుని నగరవనం పడమటి వైపు జేసీబీలతో సొరంగాల తరహాలో మరీ ఇసుకను తోడేస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది సాక్షిగా ఈ అక్రమాలు సాగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇసుకాసురుల దెబ్బకు నగరవనం ఫెన్సింగ్ సైతం కూలింది. అక్కడున్న వృక్షాల వేర్లు తేలి కూలే స్థితికి చేరాయి. గంగవరం మండలంలోని జీడిమాకులపల్లెకు చెందిన పదుల సంఖ్యలో ఇసుక స్మగర్లు జేసీబీ, ట్రాక్టర్లతో నిత్యం వందలాది లోడ్ల ఇసుకను తోడి తరలిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు హైవే మీదుగా నాగమంగళంలో వెళ్లి పట్టణంలోకి వస్తున్నా ఇదే మార్గంలోని ఆర్డీఓ, తహసీల్దార్, ఇరిగేషన్, పోలీసు శాఖలు అసలు పట్టించుకోవడం లేదు. ఫారెస్ట్ శాఖ పరిధిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నా దృష్టి సారించిన పాపానపోవడం లేదు. జీడిమాకులపల్లెలోనే 80 ఇసుక ట్రాక్టర్లు, పది జేసీబీలు 60మంది కూలీలకు పైగా రేయింబవళ్లూ అనే తేడా లేకుండా ఇసుకను తోడేస్తున్నారు. రాత్రిపూట ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేసి నదిలోని ఇసుకను గుట్టలుగా పోసి, నీరు ఇంకిపోయాక పగటిపూట దాన్ని తరలిస్తున్నారు. ఈ విషయమై నగరవనం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సురేంద్రను వివరణ కోరగా.. వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ



గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పత్తికొండలో..

గంగవరం: సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై అవగాహనా ర్యాలీని మండలంలో గంగవరం, పత్తికొండ పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు శ్రీనివాసులు, మల్లికార్జున్‌రెడ్డి గురువారం నిర్వహించారు. సికిల్‌సెల్ అనీమియా వ్యాధి అంటే ఏమిటి? వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు. సికిల్‌సెల్ అనేది రక్త కణాలకు సంబంధించి వారసత్వంగా సంక్రమించే వ్యాధి అని, శరీరంలో రక్త కణాలు కొడవలి ఆకారంలో మార్పు చెంది, వాటి సంఖ్య తగ్గిపోవడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన కీళ్ల నొప్పులు, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తరచూ అంటు వ్యాధులకు గురికావడం ఈ వ్యాధి ముఖ్య లక్షణాలన్నారు. ఇలాంటి లక్షణాలతో బాధపడుతున్న ఉన్నవారు సమీపంలోని ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలని, వ్యాధి బారినపడినట్లు తేలితే ఉచితంగా చికిత్స పొందవచ్చన్నారు. పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి జింక్ మాత్రలు, రోటా వ్యాక్సిన్ విటమిన్ లాంటివి ఆసుపత్రిలో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బండకిందపల్లెలో విత్తనాల పంపిణీ నిల్!

- గగ్గోలు పెడుతున్న రైతులు

రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ఇంతవరకు అందలేదు. పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లె గ్రామ పంచాయతీలను బండకిందపల్లె గ్రామ సచివాలయంగా ఎంపిక చేశారు. ఈ ఏడాది బండకిందపల్లె గ్రామ సచివాలయానికి 210 బస్తాల వేరుశనగ విత్తనాలు వచ్చాయి. అయితే సచివాలయ పరిధిలో రైతులు సుమారు 1,350 మంది ఉన్నారని 210 బస్తాల వేరుశనగ విత్తనాలు ఇస్తే ఎలా పంపిణీ చేయాలని సచివాలయ ఇన్‌చార్జి అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. గత సంవత్సరం 450 బస్తాలు ఇచ్చారని ఈ సంవత్సరం 210 బస్తాలు ఇస్తే ఎవరికి ఇవ్వాలో అర్థం కాక విత్తనాల పంపిణీ నిలిచి పోయింది. దీనికితోడు రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జి నరసింహులు నెల రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో సెలవుపై వెళ్లారు. దీంతో ఇక్కడ సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ ఆగిపోయింది. మండల వ్యవసాయాధికారులైనా చర్యలు తీసుకుని విత్తనాలు పంపిణీ చేమాలని రైతులు కోరుతున్నారు.



బండకిందపల్లె రైతు సేవా కేంద్రం కార్యాలయం

విజయనగరంలో రోడ్డు ప్రమాదం

- మృతుడు బైరెడ్డిపల్లె మండల వాసి

డెంకాడ: విజయనగరం–నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారిపై డెంకాడ మండలం, పెదతాడివాడ కూడలి సమీపంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో చిత్తూరు జిల్లాకు చెందిన యానాది రవి(36) మృతి చెందాడు. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యానాది రవి, బావ కంతలచెరువు గోపి ఈ నెల 13వ తేదీన చిత్తూరు జిల్లా నుంచి ఐషర్ వ్యాన్‌లో టమాటా లోడ్‌తో విజయనగరం వచ్చారు. 15వ తేదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో అన్‌లోడ్ చేశారు. అక్కడి నుంచి ఐషర్ వాహనం యజమానికి ఫోన్‌చేయగా పెదతాడివాడ వద్ద ఉన్న న్యూ వెంకట్ మినీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి వెళ్లి చిత్తూరుకు ఏమైనా కిరాయి ఉంటే చేసుకుని రావాలని చెప్పారు. ఈ క్రమంలో యానాది రవి, బావ కంతలచెరువు గోపి పెదతాడివాడ వచ్చారు. 18వ తేదీ రాత్రి భోజనం అనంతరం 11.30 గంటల సమయంలో ఫోన్ పట్టుకుని రవి బయటకు వెళ్లగా, గోపి వాహనంలో సేదతీరుతున్నాడు. ఇంతలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొట్టింది. చీకట్లో వెళ్లి వెతకగా రవి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే 108కు ఫోన్ చేయగా వారు యానాది రవిని పరీక్షించారు. అప్పటికే అతను మృతిచెందినట్టు ధ్రువీకరించారు. మృతుడి బావ కంతలచెరువు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు యానాది రవి చిత్తూరు జిల్లా, బైరెడ్డిపల్లె మండలం, నెల్లిపట్ల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.



గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించిన యానాది రవి

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

శాంతిపురం: మొరసనపల్లి పంచాయతీలోని కనుమలదొడ్డి (7వ మైలు)లో అక్రమంగా నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌ను రాళ్లబూదుగూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమారి గురువారం సీజ్ చేశారు. ఇక్కడ ఆర్‌ఎంపీ సింగారవేలు తన పరిమితికి మించి చేస్తున్న వైద్యంపై వరుస ఫిర్యాదులు రావడంతో సీజ్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే గత నెల 23న ఇక్కడ వైద్యం పొందిన కెఎస్ఎం వేలు(46) మృతి చెందిన నేపథ్యంలో జరుగుతున్న వైద్యంపై తనిఖీ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీ క్లినిక్‌ను నడుపుతున్నట్టు గుర్తించామని చెప్పారు. క్లినిక్‌లో సెలైన్ బాటిళ్లు, సూది మందులు, ఇతర సామగ్రి ఉండడంతో సీజ్ చేసి, ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు.

చికెన్ సెంటర్లు, హోటళ్లలో తనిఖీలు

పలమనేరు: పట్టణంలోని పలు హోటళ్లు, చికెన్ దుకాణాల వద్ద పరిశుభ్రత, నాణ్యత, ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై స్థానిక మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. పలు చికెన్ దుకాణాల వద్ద కంపు కొడుతూ అపరిశుభ్రంగా ఉన్నట్టు గుర్తించారు. కొన్ని హోటళ్ల వద్ద మరీ అధ్వాన్నంగా ఉందని గమనించారు. ఇక ఎటుచూసినా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు సాగుతున్నట్టు గమనించి కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తంమీద పది దుకాణదారులకు రూ.5వేల జరిమానా విధించినట్టు స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. తనిఖీలలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

ప్రింటర్లు పాడైతే నాకేంటి సంబంధం?

గంగవరం: ''గ్రామ సచివాలయాల్లో ప్రింటర్లు పాడైతే నాకేంటి..? నేనేం బాగు చేసేవాడినా..? సచివాలయాల్లో సమస్యను నా దగ్గరకు తీసుకురావొద్దు.. పంచాయతీ కార్యదర్శులను అడగండి.. ప్రజల సమస్యలతో నాకు సంబంధం లేదు.. నేను ఎంపీడీఓని.. నన్నెవరూ అడగడాల్సిన అవసరం లేదు..'' అంటూ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సరేష్‌బాబు రుసరుసలాడారు. వివరాలు.. గంగవరం–1 గ్రామ సచివాలయంలో కొన్ని రోజులుగా ప్రింటర్ పని చేయడం లేదు. ఆన్‌లైన్ సేవలకు సంబంధించి ప్రజలకు ఎలాంటి రసీదులు అందడం లేదు. దీనిపై సచివాలయ ఉద్యోగులను ప్రశ్నించగా ప్రింటర్‌లోకి ఎలుకలు చేరి పాడైందని బదులిచ్చారు. ఎన్ని రోజులైనా ప్రింటర్ రెడీకాకపోవడంతో వివిధ సర్టిఫికెట్లకు కోసం ప్రజలు రోజూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఇదే విషయాన్ని 'సాక్షి' ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పైవిధంగా ప్రతిస్పందించారు. ఉన్నతాధికారులైనా స్పందించి ఇక్కడ సేవలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎలుకల దెబ్బకు పనిచేయని ప్రింటర్ వృత్తంలో ప్రింటర్‌లో దూరిఉన్న ఎలుక

చిత్తూరు హైరోడ్డు విస్తరణ షురూ..!

చిత్తూరు అర్బన్: చిత్తూరులో హై రోడ్డు విస్తరణ పనులు ఒక్కో దశను దాటుకుని ముందుకు వెళుతోంది. కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డును వంద అడుగులుగా విస్తరించాలని పాలకులు, అధికారులు సంకల్పించారు. అయితే హైరోడ్డులో ఉన్న భవనాలకు నష్టపరిహారం ఇచ్చి, విస్తరణకు పూనుకోవాలని పలువురు ఇప్పటికే అల్టిమేటం ఇచ్చారు. మరికొందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వంద అడుగుల రోడ్డుకు స్థలాన్ని అప్పగిస్తున్నారు. గురువారం కట్టమంచిలోని కొందరు భవన యజమానులు కలిసి వంద అడుగుల రోడ్డు విస్తరణకు తమ ఆధీనంలో ఉన్న స్థలాన్ని కార్పొరేషన్ అధికారులకు అప్పగించారు. దీంతో ఎలాంటి ఆర్థికభారం లేకుండా కార్పొరేషన్ అధికారులు ఆ స్థలాన్ని విస్తరణకు ఉపయోగిస్తున్నారు.



కట్టమంచిలో ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన స్థలాన్ని విస్తరిస్తున్న ఏసీపీ నాగేంద్ర

మామిడి రైతులను ఆదుకోని కూటమి ప్రభుత్వం

చిత్తూరు కార్పొరేషన్: రైతులంటే సీఎం చంద్రబాబునాయుడుకు ఎప్పుడూ చిన్నచూపేనని వైఎస్సార్‌సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞాన జగదీష్ విమర్శించారు. మామిడి కాయల లోడును జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద దించుకోవడానికి దళారులు రైతుల నుంచి వందల్లో వసూలు చేస్తున్నారని, అసలే గిట్టుబాటు ధర లేక నష్టాలతో కుదేలైన రైతన్నలకు ఈ దోపిడీ మరింత బాధకు గురిచేస్తోందన్నారు. మరోవైపు టోకెన్లు పొందిన రైతులు ఫ్యాక్టరీ లోపల వెళ్లి వెలుపలికి రావాలంటే రోజులు పడుతోందన్నారు. మామిడి కాయలు అమ్మేందుకు వచ్చిన రైతులు వారం రోజులుగా జాతీయ రహదారిపై తిండీతిప్పలు లేకుండా నిరీక్షిస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా మామిడి రైతాంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రైతులు శాపనార్థాలు పెడుతున్నారన్నారు.

కూటమి నిర్వాకంతోనే మామిడి నష్టాలు



విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం నిర్వాకంతోనే మామిడి రైతులు నష్టపోతున్నారని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిల్వ చేరిన పల్ప్ వల ప్రస్తుతం మామిడి కొనుగోలు మందగించిందన్నారు. వీటిపై రైతులకు మద్దతుగా తాను మాట్లాడితే ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తప్పుపట్టడాన్ని ఖండించారు. కనీస అవగాహన లేకుండా ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి అప్రతిష్ట వస్తోందని డైవర్షన్ పాలిటిక్స్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. రోజుల తరబడి కాయల లోడును అమ్ముకోవడానికి ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నా రైతులకు అవస్థలు తప్పడం లేదన్నారు. గిట్టుబాటు ధర లేక, కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేక రైతులు మామిడి కాయలను పా రేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు పలు మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయని, ఆ రైతులకు ఎంత బాధ ఉంటుందో ప్రజాప్రతినిధిగా గురజాల ఆలోచించాలన్నారు. ఫ్యాక్టరీ ధర, ప్రభుత్వ సబ్సిడీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నా రు. టోకెన్ విధానం పెట్టినా అది అధికార పార్టీ నాయకుల సిఫార్సుదారులకు తప్పితే రైతుల కు ఉపయోగపడటం లేదనేది గుర్తెరగాలన్నా రు. ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.